క్లుప్తంగా

మున్నేట్లో చిక్కుకున్న వాహనాలు సురక్షితం



నందిగామ: పట్టణ శివారు మున్నేరు ఉపనదిలో ఓ జీపు, ట్రాక్టర్ చిక్కుకున్న సంగతి పాఠకులకు విదితమే. పట్టణానికి చెందిన పలువురు యువకులు మంగళవారం సాయంత్రం సరదాగా జీపులో మున్నేట్లో తిరిగేందుకు వెళ్లారు. ఆ సమయంలో ఒక్కసారిగా మున్నేరు ఉపనదికి వరద నీరు వచ్చి చేరడంతో యువకులు తీసుకు వెళ్లిన జీపు వరద నీటిలో చిక్కుకుంది. దానిని ఒడ్డుకు తీసుకువచ్చేందుకు వెళ్లిన ఓ ట్రాక్టర్ కూడా వరద నీటిలో చిక్కుకుపోయింది.ఆ రెండు వాహనాలను ఒడ్డుకు చేరవేసేందుకు పలు భారీ వాహనాలతో రాత్రి పొద్దుపోయే వరకు శ్రమించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో బుధవారం వేకువ జామునే మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించారు.వరద నీటి ఉధృతి యథావిధిగా ఉన్నప్పటికీ శ్రమించి మొత్తానికి వరద నీటిలో చిక్కుకున్న రెండు వాహనాలను ఒడ్డుకు తీసుకువచ్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అదుపు తప్పి కారు పల్టీ నలుగురికి స్వల్ప గాయాలు



నందిగామ: కారు అదుపుతప్పి పల్టీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలైన ఘటన బుధవారం రాత్రి నందిగామ పట్టణ సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు పట్టణ శివారు డీవీఆర్ కాలనీ సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారి ఫ్లైఓవర్ మీద ప్రయాణిస్తున్న సమయంలో కారు టైరు పంక్చర్ అవడంతో కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఆ సమయంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు.

శైలజారెడ్డికి సత్కారం

జి.కొత్తూరు(తిరువూరు): నీట్ పీజీ మెడిసిన్ ప్రవేశపరీక్షలో అఖిలభారత స్థాయిలో 300వ ర్యాంకు సాధించిన మండలంలోని జి.కొత్తూరుకు చెందిన యరమల శైలజారెడ్డిని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ ప్రతినిధులు బుధవారం సన్మానించారు. జి.కొత్తూరులోని ఆమె నివాసంలో కలిసిన సంఘ కన్వీనర్ రాంప్రదీప్ తదితరులు శైలజారెడ్డికి శాలువా కప్పి జ్ఞాపిక బహూకరించారు. ఎంపీటీసీ సభ్యురాలు యరమల రాధ పాల్గొన్నారు.

ప్యాసింజర్ ట్రైన్ కొండపల్లిలో ఆపాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి రైల్వే స్టేషన్‌లో డోర్నకల్ 07755 నంబర్ ప్యాసింజర్ ట్రైన్ ఆగేలా చూడాలని విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్‌కు పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు కోరారు. ఈ మేరకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కరోనాకు ముందు కొండపల్లి స్టేషన్‌లో రైలు నిలిచేదని పేర్కొన్నారు. కరోనా అనంతరం ఆదాయం రాని చెరువు మాధవరం, రాయనపాడు స్టేషనల్లలో ఆపి లక్ష జనాభా కలిగిన కొండపల్లికి హాల్ట్ ఇవ్వలేదని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎన్నో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగుతున్న స్టేషన్‌లో డోర్నకల్ ప్యాసింజర్ నిలుపుదల చేయాలని కోరారు.

దుర్గమ్మ సన్నిధిలో మజ్జిగ పంపిణీ ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈఓ భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవిని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఆలయ ప్రాంగణంలో బుధవారం నుంచి ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభమైంది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన మజ్జిగ పంపిణీని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ ప్రారంభించారు. భక్తులు అందజేసిన విరాళాలతో మజ్జిగ పంపిణీ చేపడుతున్నట్లు ఆలయ సిబ్బంది పేర్కొన్నారు. వేసవి కాలం పాటు మజ్జిగ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, విరాళాలు ఇచ్చిన దాతల పేర్లు మజ్జిగ పంపిణీ కేంద్రం వద్ద ప్రదర్శిస్తామన్నారు. తొలి రోజున ఈఓ భ్రమరాంబ, కె.అమరేంద్ర, నూనె భవానీశంకర్, నాళం వెంకటేశ్వర్లు, నాళం శ్రీమన్నారాయణమూర్తి, వడ్డాది పాండురంగారావు, పర్నికలు విరాళాలను అందజేశారు.



నందిగామలో వాసవి అమ్మవారి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేద పండితుడు



నందిగామలోని ఓ ఇంటి ముంగిట ఉగాది సందర్భంగా వేసిన రంగవల్లి



విజయవాడలో కలెక్టర్‌తో సన్మానం అందుకున్న జగ్గయ్యపేట అర్చకుడు ముడుంబా గోపాలాచార్యులు



పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో పంచాంగ శ్రవణం



పెనుగంచిప్రోలులో పురోహితులను సన్మానిస్తున్న ఆలయ ఈఓ, చైర్మన్

తెలుగు వత్సరానికి ఘన స్వాగతం

- డివిజన్‌లో ఘనంగా ఉగాది వేడుకలు
- పలు చోట్ల పంచాంగ శ్రవణాలు
- ఆలయాల్లో విశేష పూజలు

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా శ్రీ శోభకృత్ నామ ఉగాది పర్వదినాన్ని ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. పండుగను పురస్కరించుకుని వేకువ జాము నుంచే భక్తులు వివిధ ఆలయాలకు క్యూ కట్టడంతో ఆలయాలు కిటకిటలాడాయి. ప్రతి ఆలయంలో షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని ప్రసాదంగా పంపిణీ చేశారు. సూర్యాస్తమయం సమయంలో పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం జరిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, మరిడి మహాలక్ష్మి అమ్మవారు, వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారు, శ్రీ వెంకటేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, షిరిడి సాయిబాబా, అయ్యప్ప స్వామి, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, సీతారామాంజనేయ స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు జరిగాయి. పట్టణ శివారు పల్లగిరి గుట్టపై ఉన్న త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఇదే కొండపై గల స్వయంభు శివలింగం వద్ద భక్తులు స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. మండల పరిధిలోని కూడలి సంగమేశ్వర స్వామి ఆలయం, అంబారుపేటలోని శ్రీ సత్యమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని గోళ్ళమూడి, రాఘవాపురం, మాగల్లు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కొందరు మహిళలు ఇంటి ముంగిట అందమైన రంగవల్లులు అద్ది నూతన తెలుగు సంవత్సరాదికి ఘనంగా స్వాగతం పలికారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా గ్రామంలో ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మెట్ల పూజతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. రైతులు పశుసంపదకు పూజలు నిర్వహించారు. ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు, చైర్మన్ సుబ్రహ్మణ్యం భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా పెద్ద సంఖ్యలో భక్తులు రావటంతో ఉచిత, రూ.10 దర్శనం టికెట్‌లు ఇవ్వకుండా రూ.50 టికెట్ మాత్రమే ఇవ్వటంతో కొందరు భక్తులు ఆలయ సిబ్బందిపై వాగ్వాదానికి దిగారు.



తిరుమలగిరిలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేదాద్రిలో...

గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉగాది పండుగ కావటంతో స్వామి వారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో ఉగాది పచ్చడిని భక్తులకు అందించారు. అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈవో నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్చకునికి ఘన సత్కారం

పట్టణంలో ఉన్న వరదరాజ స్వామి వారి ఆలయ ప్రధానార్చకుడు ముడుంబా గోపాలాచార్యులుకు బుధవారం అర్చక ఉగాది పురస్కార అవార్డు లభించింది. పండుగ సందర్భంగా విజయవాడ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ అవార్డులలో గోపాలాచార్యులుకు అవార్డు అందింది. కలెక్టర్ ఢిల్లీరావు పురస్కారంతో పాటు రూ.10 వేల నగదు అందించారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: నూతన సంవత్సరం అందరికీ సుఖాలు కలిగించాలని శ్రీతిరుపతమ్మవారి ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో వేదపండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ పురోహితులు ఆంజనేయశర్మ శోభకృత నామ సంవత్సరం పంచాంగ శ్రవణం వినిపించారు. ముందుగా గోపూజ నిర్వహించారు. ఈ ఏడాది శోభకృత్ నామ సంవత్సరంలో సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం దేవదాయ ధర్మదాయ శాఖ ఆదేశాల మేరకు పురోహితులు రేలంకి భాస్కరశర్మ, శివరాంభొట్ల సత్యనారాయణశర్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కంచికచర్ల: ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలకు చేరుకున్న భక్తులు మహన్యాసపూర్వక, అష్టోత్తర పూజలు చేశారు. ఆలయ అర్చకులు పంచాగాన్ని భక్తులకు వినిపించారు. ఈ ఏడాది ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందంతో పాటు సుఖవంతమైన వెలుగులు నిండాలని అర్చకులు ఆశీర్వచనాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అర్చకునికి నూతన వస్త్రాలు అందజేశారు.

వీరులపాడు: మండలంలో శుభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగను ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పండుగ సందర్భంగా ఆయా ఆలయాలలోని స్వామి వార్లను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు.

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నం

జగ్గయ్యపేట అర్బన్: ఉగాది అంటేనే తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం అని శ్రీగురుధాం వ్యవస్థాపకుడు, ప్రముఖ ఆధ్యాత్మిక తత్వవేత్త, డాక్టర్ అబ్దుల్ కలాం అంతర్జాతీయ అవార్డు గ్రహీత గెంటేల వెంకట రమణ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం స్థానిక బి.కన్వెన్షన్ హాల్‌లో విమలాభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా గెంటేల వెంకట రమణ దంపతులు, గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్, రామ్‌కో సిమెంట్స్ సీనియర్ ప్రెసిడెంట్ రవిశంకర్ దంపతులు పాల్గొన్నారు. గెంటేల వెంకట రమణ మాట్లాడుతూ అంతరించిపోతున్న తెలుగు సంప్రదాయలకు ఇలాంటి కార్యక్రమాలు జీవం పోస్తాయన్నారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు ఈ ప్రాంతంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ పెద్దలు, మహామహులు ఈ కార్యక్రమానికి వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అతిథులను ఉదయభాను, విమలాభాను, వారి తనయుడు వైఎస్సార్ సీపీ యువ నేత సామినేని వెంకటకృష్ణప్రసాద్ సన్మానించారు.

మహాలక్ష్మీ అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు

నందిగామ టౌన్: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ ప్రజల జీవితాలలో నూతన వెలుగులు నింపాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని అనాసాగరంలో ఉన్న మహాలక్ష్మీ అమ్మవారిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పంటలు సంవృద్ధిగా పండి ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో మెలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాములపాటి రమేష్, కరి రవీంద్ర, పాకాలపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఎమ్మెల్యేకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

ఉగాది పండుగ సందర్భంగా పలువురు అధికారులు ఎమ్మెల్యే జగన్‌మోహనరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నందిగామ టౌన్, రూరల్ సీఐలు సతీష్, నాగేంద్ర కుమార్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్యేకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎడ్లకు పూజలు చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఎడ్లకు పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ: పాడి పంటలు సవృద్ధిగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు అన్నారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం రాత్రి వృషభ రాజులకు(ఎడ్లకు పూజలు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఎడ్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



కంచికచర్ల వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అర్చకునికి నూతన వస్త్రాలు బహూకరణ



పేటలో ఉగాది సభలో ప్రసంగిస్తున్న గజల్ శ్రీనివాస్



పేటలో గెంటేల వెంకటరమణ దంపతులను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను దంపతులు

సెప్టిక్ వ్యర్థాలు.. అదురుతున్న ముక్కుపుటాలు

- రోడ్ల వెంబడి వదులుతున్న వైనం
- పట్టించుకోని అధికార గణం
- అవస్థలు పడుతున్న ప్రజానీకం

వీరులపాడు: ఇళ్లలోని సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను సెప్టిక్ ట్యాంకుల నిర్వాహకులు రోడ్ల వెంబడి వదులుతుండటంతో రైతులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు కంచికచర్ల పట్టణం, మండలంలోని గ్రామాలలోని సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసి ఆ వ్యర్థాలను వీరులపాడు మండలంలోని జగన్నాథపురం గ్రామ సమీపంలో రహదారి వెంబడి వదులుతున్నారు. ఈ రహదారి ఆంధ్ర, తెలంగాణలను అనుసంధానం చేసే ప్రధాన రహదారి కావటంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సెప్టిక్ ట్యాంకు నిర్వాహకులు వ్యర్థాలను ఈ రహదారి వెంబడి వదులుతుండటంతో దుర్గంధం భరించలేక అవస్థలు పడుతున్నామని ప్రయాణికులతో పాటు సమీప గ్రామాల ప్రజలు, పంట పొలాలకు వచ్చే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జగన్నాథపురం సమీపంలో రోడ్ల వెంబడి వ్యర్థాలు వదులుతున్న సెప్టిక్ ట్యాంకు నిర్వాహకులు

పట్టించుకోని అధికారులు

గ్రామ ప్రారంభంలోకి వచ్చేసరికి వ్యర్థాల దుర్గంధంతో ముక్కుపుటాలు అదురుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అంతేకాకుండా రోడ్ల వెంబడి వదిలిన వ్యర్థాలు రోజుల తరబడి నిల్వ ఉంటుండటంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయంటున్నారు. దోమల ధాటికి రోగాల బారిన పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. సెప్టిక్ ట్యాంకు నిర్వాహకులు వ్యర్థాలను రోడ్ల వెంబడి వదులుతున్నా సంబంధిత శాఖాధికారులు కనీసం పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల వెంట సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు వదలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు. దీనిపై ఎస్‌ఐ సోమేశ్వరరావును వివరణ కోరగా రోడ్ల వెంబడి వ్యర్థాలు వదిలితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నాం



సెప్టిక్ ట్యాంకు నిర్వాహకులు రోడ్ల వెంబడి వ్యర్థాలు వదులుతుండటంతో భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆ దారిన ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– వెల్లంకి పద్మారావు, జుజ్జూరు

అధికారులు చర్యలు తీసుకోవాలి



మండలంలోని ఆయా గ్రామాల వెంబడి సెప్టిక్ ట్యాంకు నిర్వాహకులు ఇష్టారీతిన వ్యర్థాలను వదులుతున్నారు. దీని వలన ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి..

– షోడగిరి డేవిడ్, పొన్నవరం

బాధిత కుటుంబానికి భరోసా

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి బాధిత కుటుంబానికి భరోసా అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.6.55 లక్షల చెక్కులను స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన 10 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ వైద్యం ఖర్చుల భారం నిరుపేదలపై పడకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సహకారం అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి బాధిత కుటుంబాలకు కొండంత ధైర్యాన్ని ఇస్తుందని తెలిపారు. నిరుపేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే మహోన్నత లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వ వైభవం తీసుకురావటంతో పాటు 2600కు పైగా జబ్బులను ఆరోగ్యశ్రీలో చేర్చి పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పథకం జాబితాలో లేని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అండగా నిలుస్తున్నారని చెప్పారు. నందిగామ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే 404 మంది లబ్ధిదారులకు రూ.2.08 కోట్ల మేర ముఖ్యమంత్రి సహాయ నిధి అందించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, దాసు, పారుపల్లి హరిబాబు, చింతా రవీంద్ర, మార్త శ్రీను, బుడ్డి సత్యం, నల్లాని సాయిబాబు, చలమల మధు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

రేపు కళాకారుల సమ్మేళనం

తిరువూరు: రంగస్థల నటులు, కళాకారులతో తిరువూరులో ఈ నెల 24న ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి నాట్యమండలి, శ్రీవీరాంజనేయ నాట్యమండలి ప్రతినిధులు తెలిపారు. అంతరించిపోతున్న రంగస్థల, పద్యనాటక రంగాలకు పూర్వ వైభవాన్ని తీసుకురావడం, కొత్త కళాకారులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. తిరువూరు పాత శివాలయంలోని త్యాగరాజ గానకళాసమితి వేదికపై సాయంత్రం ఆరు గంటలకు జరిగే కార్యక్రమంలో కళాకారులు పాల్గొనాలని కోరారు.

పేట నుంచి హైదరాబాద్‌కు నూతన బస్ సర్వీసు ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: ప్రజలకు ఆధునిక వసతి సౌకర్యాలతో మెరుగైన సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక నూతన బస్సు సర్వీసులను ఏర్పాటుచేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో పేట పట్టణం నుంచి హైదరాబాద్(మియాపూర్)కు నూతనంగా ఏర్పాటుచేసిన సూపర్ లగ్జరీ నూతన బస్సు సర్వీసును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దీనిలో భాగంగా ఆర్టీసీని అభివృద్ధి పథంలో ఉండే విధంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడతూ ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తోందని తెలిపారు. బస్సు ఉదయం 6 గంటలకు జగ్గయ్యపేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయలుదేరి హైదరాబాద్ లోని మియాపూర్‌కు 11.45 కు చేరుకుంటుందని, తిరిగి అదేరోజు రాత్రి 9.30కు మియాపూర్ నుంచి బయలు దేరి జగ్గయ్యపేట మీదుగా 3.10 కి పెనుగంచిప్రోలుకు చేరుకుని, తిరిగి అక్కడి నుంచి జగ్గయ్యపేటకు 3.40 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ బస్సుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఆర్టీసీ జిల్లా ఆర్ఎం డి.యేసుదానం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఎం ఎంవీ ప్రసాద్, విజయవాడ దుర్గ గుడి ట్రస్ట్ బోర్డు సభ్యుడు నంబూరి రవి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కఠారి హరి, పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బద్దూనాయక్, డిపో యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, ఆర్టీసీ అధికారులు

ధ్యాన విధానం అందరూ ఆచరించాలి

పెనుగంచిప్రోలు: ఆధ్యాత్మిక గురువు విశ్వస్ఫూర్తి సూచించిన ధ్యాన విధానం అందరూ ఆచరించాలని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం స్థానిక తంబరేణి ఫంక్షన్ హాల్‌లో స్ఫూర్తి కుటుంబ సభ్యుల ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఆధ్యాత్మికతను, సైన్స్‌ను, మనిషిలోని మానవత్వాన్ని ఏకం చేసి విశ్వానికి స్ఫూర్తిని ప్రసాదిస్తున్న వ్యక్తి విశ్వస్ఫూర్తి అన్నారు.

మహిళ ఆత్మహత్య

కంచికచర్ల: ఓ మహిళ అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని కీసర గ్రామానికి చెందిన నన్నెబోయిన ఉమారాణి(30)కి వీరులపాడు మండలం తాటిగుమ్మి గ్రామానికి చెందిన నరసింహారావుతో 9 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 5 ఏళ్ల బాబు ఉన్నాడు. ఆమెకు ఆరోగ్యం బాగోలేకపోవటంతో పుట్టింటి వద్దనే ఉంటుంది. మంగళవారం అర్ధరాత్రి చీరతో ఫ్యానుకు ఉరేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను కిందకు దించి వైద్య చికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మార్గంమధ్యలోనే ఆమె మృతిచెందిందని వైద్యులు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.